# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వము

పత్రికా ప్రకటన-2 29, సెప్టెంబరు, 2014

ప్రతి ఇంటికి నల్లా ద్వారా మంచినీరు అందించడం తన కల అని, తెలంగాణ ప్రభుత్వ మొదటి లక్ష్యం కూడా అదేనని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ప్రకటించారు. బడ్జెట్‌లో కూడా నిధుల కేటాయింపులో మంచినీటి కోసమే అత్యధిక ప్రాధాన్యం ఇస్తామని సిఎం చెప్పారు. తెలంగాణ డ్రింకింగ్ వాటర్ గ్రిడ్ సమీక్షా సమావేశం సోమవారం సచివాలయంలో జరిగింది. పంచాయతీరాజ్ శాఖ మంత్రి కెటి.రామారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, వివిధ శాఖల కార్యదర్శులు నాగిరెడ్డి, ఎస్‌కె.జోషి, రేమాండ్ పీటర్, ప్రదీప్‌చంద్ర, సిఎంఒ ముఖ్య కార్యదర్శి నర్సింగ్‌రావులతో పాటు ఆర్‌డబ్ల్యుఎస్ రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. అధికారులు రూపొందించిన మ్యాపులను, కాంటూర్‌లను పరిశీలించారు. గూగుల్ ఎర్త్ సహకారంతో తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో వున్న నీటి వనరులను, కాంటూర్‌లను, భౌగోళిక పరిస్థితులను ముఖ్యమంత్రి పరిశీలించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ తెలంగాణలో నిర్వహించబోయే డ్రింకింగ్ వాటర్ గ్రిడ్ ప్రపంచ రికార్డు నెలకొల్పుతుందని వెల్లడించారు. మొత్తం 1,26,036 కిలో మీటర్ల పొడువులో పైపులైను నిర్మిస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు. భూమి చుట్టు కొలత 33 వేల కిలోమీటర్లయితే అంతకు నాలుగు రెట్ల పైపులైను తెలంగాణలో వేస్తామని వెల్లడించారు. తెలంగాణలో వేసే పైపులైను పొడవుతో నాలుగుసార్లు భూమిని చుట్టి రావచ్చని అన్నారు. ఇది ప్రపంచ రికార్డుగా నిలుస్తుందన్నారు. 5,227 కిలోమీటర్ల మెయిన్ ట్రంక్ లైన్, 45,809 కిలోమీటర్ల సెకండరీ నెట్‌వర్క్, 75 వేల కిలోమీటర్ల డిస్ట్రిబ్యూటరీ నెట్‌వర్క్ పైపులైన్లు నిర్మించనున్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు. ఆర్‌డబ్ల్యుఎస్, మెట్రో వాటర్ వర్క్స్, పబ్లిక్ హెల్త్ లాంటి శాఖలు ప్రజలకు మంచినీరు సరఫరా చేయడం కోసం పనిచేస్తున్నాయని, ఇవన్నీ ఒకే గొడుగు కిందికి రావలసిన అవసరం వుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. మంచినీరు సరఫరా చేయడానికి ఉద్దేశించిన వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులోనే పరిశ్రమలకు నీరందించే వెసులుబాటు కల్పించాలని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రజలకు మంచినీరు, పరిశ్రమలకు నీరు అందించే బాధ్యతలను ఆర్‌డబ్ల్యుఎస్ స్వీకరించాలని చెప్పారు. ఇందుకోసం ఎంత వ్యయం అవుతుంది, ఎంత నీరు అవసరం అవుతుంది అనే విషయాలపై ఖచ్చితమైన అధ్యయనం జరగాలన్నారు. ప్రస్తుతం వున్న మంచినీటి సరఫరా వ్యవస్థకు, పరిశ్రమలకు ఎంత నీరు అవసరం? హైదరాబాద్‌తో పాటు ఇతర పట్టణ ప్రాంతాలకు ఎంత నీరు అవసరం?

గ్రామాలకు ఎంత నీరు అవసరం? ఆసుపత్రులు, కార్యాలయాలు, ఇతర సంస్థలకు ఎంత నీరు కావాలి? అనే విషయాలన్నింటిని క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని చెప్పారు. ఇంకా ఎంత నీరు అవసరమో గుర్తించాలన్నారు. మొత్తంగా రాబోయే 30 సంవత్సరాలకు సంబంధించిన అవసరాలు కూడా తీర్చే విధంగా వాటర్ గ్రిడ్ రూపకల్పన జరగాలన్నారు. పట్టణ ప్రాంతాలకు నీటి సరఫరా చేసే బాధ్యతలను కూడా ఆర్‌డబ్ల్యుఎస్ స్వీకరించాలన్నారు. ఏ జిల్లాకు ఏ నీటి వనరు ద్వారా నీరందించాలనే విషయంలో ఖచ్చితమైన అవగాహనకు రావాలని చెప్పారు. నీటి వనరు నుండి గ్రామాలకు నీరు అందించేందుకు పూర్తిగా లిఫ్టుల మీద ఆధారపడవద్దని, సమీపంలోని కాంటూర్లను గుర్తించి, అక్కడికి నీరు ఎక్కించాలని, అక్కడి నుండి గ్రావిటీ ద్వారా నీరు సరఫరా చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఇందుకోసం జిల్లాల వారిగా, మండలాల వారిగా కాంటూర్లను గుర్తించాలన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలోని లక్ష్మీదేవిపల్లిలో 670 మీటర్ల కాంటూర్ వుందని, ఇది తెలంగాణలోనే ఎత్తైన కాంటూరు అని సిఎం చెప్పారు. అక్కడికి నీరు ఎక్కిస్తే తెలంగాణలోని చాలా ప్రాంతాలకు గ్రావిటీ ద్వారా నీరు అందించవచ్చని అన్నారు. వరంగల్ నగరంలోని పద్మాక్షి గుట్ట ప్రాంతంలో చాలా గుట్టలున్నాయని, అక్కడకి ఎల్‌ఎండి నీరును ఎక్కిస్తే సగం జిల్లా అవసరాలు తీర్చవచ్చన్నారు. సిద్దిపేటలోని గుడ్డేలుగుల గుట్ట పైకి ఎల్ఎమ్‌డి నీరు ఎక్కించి మొత్తం గ్రామాలకు నీరందిస్తున్న విషయాన్ని ముఖ్యమంత్రి అధికారులకు వివరించారు. ఇదే విధంగా ఎక్కడి నుండి నీరు తెస్తాము, ఏ కాంటూరు పైకి నీరు ఎక్కిస్తాము, అక్కడి నుండి ఏఏ ప్రాంతాలకు నీరు సరఫరా చేస్తాము అనే విషయాలను గుర్తించాలని చెప్పారు. జూరాల, నాగార్జునసాగర్ లాంటివి శాశ్వత నీటి వనరులుగా వుంటాయని, గోదావరి ఎత్తిపోతల పథకం లాంటివి కొన్ని రోజులు మాత్రమే నీరు అందించగలుగుతాయన్నారు. అలాంటి చోట్ల స్టోరేజ్ ట్యాంకులను నిర్మించాలని చెప్పారు. నదులపై కూడా అక్కడక్కడా ఆనికట్ (చెక్‌డ్యామ్ తరహాలో) నిర్మించాలని సూచించారు. జలాశయాల్లో కూడా 365 రోజుల పాటు మంచినీటి అవసరాలు తీర్చడం కోసం డెడ్ స్టోరేజ్ లెవల్స్‌ను నిర్వహించాలని ముఖ్యమంత్రి చెప్పారు. హైదారాబాద్ నగరం మినహాయిస్తే మిగతా తెలంగాణకు దాదాపు 80 టిఎమ్‌సిల నీరు అవసరం అవుతుందని ముఖ్యమంత్రి అంచనా వేశారు. ప్రస్తుతం వున్న మంచినీటి పథకాలు ప్రతి మనిషికి 30 లీటర్ల నీరు అందించడం కోసం ఉద్దేశించబడ్డాయని, మరో 70 లీటర్ల కోసం ప్రాజెక్టును రూపకల్పన చేయాలని ముఖ్యమంత్రి వెల్లడించారు. కృష్ణా, గోదావరి బేసిన్లలో నీటి లభ్యతపై సమగ్ర అధ్యయనం చేయాలని, ఇది మొత్తం వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుకు మూలస్తంభం అవుతుందని ముఖ్యమంత్రి వెల్లడించారు.

---

సిపిఆర్ఓ టు సిఎం